తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్. చిత్రంలో నాయకులు గెల్లు, కిశోర్, దూదిమెట్ల

కేసీఆర్ ధైర్యంతోనే దండిగా పంటలు

- కాళేశ్వరంపై రేవంత్‌కు అవగాహన శూన్యం
- తట్టెడు మట్టెత్తకుండానే పుట్టెడు అబద్ధాలు
- బీఆర్ఎస్ పాలనలోనే పెరిగిన సాగు విస్తీర్ణం
- అన్నదాతలకు కాంగ్రెస్ సర్కార్ చేసిందేంది?
- మాజీ ఎంపీ వినోద్‌కుమార్

హైదరాబాద్, నవంబర్ 18 (నమస్తే తెలంగాణ) : కాళేశ్వరం లేకుండానే వానకాలంలో పంటల దిగుబడి భారీగా పెరిగిందని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పడం చూస్తుంటే ఆయనకు ఈ ప్రాజెక్టుపై అవగాహన లేదనే విషయం స్పష్టమవుతున్నదని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ ఎద్దేవాచేశారు. కేసీఆర్ రైతుబంధు ఇచ్చి, 24 గంటల కరెంట్ సరఫరా చేసి, చెరువులను పునరుద్ధరించి రైతాంగానికి ధైర్యమిచ్చినందునే దండిగా పంటలు పండాయని చెప్పారు. చెరువులు, ప్రాజెక్టుల్లో తట్టెడు మట్టి తీయని, మెగావాట్ కరెంట్ కూడా ఉత్పత్తి చేయని రేవంత్‌రెడ్డి పుట్టెడు అబద్ధాలు చెప్తున్నారని మండిపడ్డారు. కేసీఆర్ పదేండ్ల పాలనలో హిమాలయాల ఎత్తుకు పెరిగిన తెలంగాణ ప్రతిష్టను రేవంత్‌రెడ్డి ఏడాదిలోనే అధఃపాతాళానికి దిగజార్చారని దుయ్యబట్టారు. 'కాళేశ్వరం ప్రాజెక్టును వాడుకోలేదని చెప్తున్న రేవంత్‌రెడ్డి.. ఎల్లంపల్లి నుంచి మిడ్ మానేరుకు నీటిని ఎలా తరలించారో చెప్పాలని నిలదీశారు. 'పంపులు ఆన్ చేయకుండానే ఎత్తిపోశారా?.. ఈ ప్రాజెక్టులు కాళేశ్వరంలో భాగం కావా?' అంటూ ప్రశ్నలు సంధించారు. కాళేశ్వరం అంటే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల మాత్రమే కాదనే విషయాన్ని గుర్తుంచుకోవాలని చురకలంటించారు. సోమవారం ఆయన బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్, నాయకులు కిశోర్‌కుమార్, దూదిమెట్ల బాలరాజుతో కలిసి తెలంగాణ భవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2014-15లో 26 లక్షల ఎకరాల్లో పంటలు సాగైతే, కేసీఆర్ పదేండ్ల పాలనలో 67 లక్షల ఎకరాలకు పెరిగిందని గుర్తుచేశారు. ఎత్తుపై ఉన్న తెలంగాణ ప్రాంతానికి ప్రాణహిత నుంచి నీరందించేందుకే బృహత్తర కాళేశ్వరం నిర్మించారని చెప్పారు. ఈ ప్రాజెక్టు అవసరమే లేదని మాట్లాడుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మూసీలోకి మల్లన్నసాగర్ నీటిని ఎలా తరలిస్తారో చెప్పాలని నిలదీశారు.

మన ఎంపీలుంటే మేడిగడ్డ బాగయ్యేది

పార్లమెంట్ ఎన్నికల్లో 8 మంది చొప్పున కాంగ్రెస్, బీజేపీ నుంచి గెలిచిన ఎంపీలు తెలంగాణకు ఏం ఒరగబెట్టారని వినోద్ నిలదీశారు. ఏడాది దాటినా మేడిగడ్డను ఎందుకు బాగు చేయించలేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ఎంపీలుంటే ఏనాడో మేడిగడ్డ బాగయ్యేదని చెప్పారు. కాళేశ్వరం అనుమతుల కోసం ఢిల్లీలోని సీడబ్ల్యూసీ, నీటిపారుదల శాఖ అధికారుల చుట్టూ రేయింబవళ్లు తిరిగి సాధించామని గుర్తుచేశారు. భారీ వర్షాలను తట్టుకొని నిలబడ్డ మేడిగడ్డపై సీఎం దుష్ప్రచారం చేయడం విడ్డూరమని మండిపడ్డారు.

వంచనోత్సవాలు జరుపుకోవాలి : గెల్లు

కాంగ్రెస్ ప్రభుత్వం విజయోత్సవాలు జరుపుకోవడం సిగ్గుచేటని బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ మండిపడ్డారు. కాంగ్రెస్ సర్కారు ప్రజాపాలన విజయోత్సవాలు కాకుండా ప్రజా వంచనోత్సవాలు జరుపుకొంటే బాగుంటుందని ఎద్దేవాచేశారు. లగచర్లలో గిరిజన మహిళలపై పోలీసులు దాష్టీకం చేసినా సీతక్క స్పందించకపోవడంలోని అంతర్యమేమిటని నిలదీశారు. ఆమె సీఎం రేవంత్‌కు తొత్తుగా మారినందునే మౌనం వహిస్తున్నారని ఆరోపించారు. ఆరు గ్యారెంటీలు అమలు చేయనందుకు ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

కాళేశ్వరంపై మళ్లీ అదే అక్కసు!

- సిస్టమ్‌ను వాడుకుంటూనే మరోవైపు తప్పుడు ప్రచారం
- ఎల్లంపల్లి నుంచి కొండపోచమ్మ వరకు జలాల తరలింపు
- 25 టీఎంసీలు ఎత్తిపోత
- చెరువులు, కాలువలకు నీళ్లు విడుదలైనా వాడుకోలేదంటూ ప్రగల్భాలు
- రాష్ట్రవ్యాప్తంగా 97% అత్యధిక వర్షపాతం
- నిండుకుండల్లా రిజర్వాయర్లు

హైదరాబాద్, నవంబర్ 18 (నమస్తే తెలంగాణ): కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ సర్కారు మరోసారి అక్కసు వెళ్లగక్కుతున్నదని బీఆర్ఎస్ శ్రేణులు మండిపడుతున్నాయి. ఒకవైపు, కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన నీటి పంపిణీ వ్యవస్థను వినియోగించుకుంటూనే, మరోవైపు ప్రాజెక్టుతో సంబంధం లేకుండానే రికార్డుస్థాయిలో ధాన్యం దిగుబడి సాధించినట్టు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, సాగునీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తప్పుడు ప్రచారం చేస్తున్నారంటూ అభ్యంతరం వ్యక్తంచేస్తున్నారు. ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా సగటున గత సంవత్సరం కంటే 97 శాతానికిపైగా అధిక వర్షపాతం నమోదైంది. ఇప్పటికీ ప్రాజెక్టులన్నీ నిండుగా ఉన్నాయి. పలుచోట్ల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. చెరువులదీ అదే పరిస్థితి. రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడా ఒక్క లిఫ్ట్ కూడా రన్ చేయాల్సిన అవసరమే లేకుండా పోయింది. వరుణుడి దయ, రైతాంగం శ్రమ వెరసి రాష్ట్రంలో రికార్డు స్థాయిలో వరిపంట సాగైంది. ధాన్యం దిగుబడి వచ్చింది. రైతాంగం శ్రమను, ప్రకృతి కరుణను కాంగ్రెస్ ప్రభుత్వం తన ఖాతాలో వేసుకోవడం చర్చనీయాంశంగా మారింది. ఈ సీజన్‌లో రికార్డు స్థాయిలో ధాన్యం పండిందని చెప్తున్న ప్రభుత్వం.. ఆ మేరకు ధాన్యాన్ని కొనుగోలు చేయకుండా, కాళేశ్వరం ప్రాజెక్టుపై అక్కసు వెళ్లగక్కడం గమనార్హం.

33 టీఎంసీలు ఎత్తిపోసి..

కాంగ్రెస్ పార్టీ దివాళాకోరు రాజకీయాలకు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటనలే నిదర్శనంగా నిలుస్తున్నాయని బీఆర్ఎస్ శ్రేణులు విమర్శిస్తున్నాయి. కాళేశ్వరం ప్రాజెక్టులో మూడు బరాజ్‌లు పనిచేయకున్నా, నీటిని ఎత్తిపోయకున్నా రికార్డు స్థాయిలో ధాన్యం పండిందని ప్రచారానికి దిగడమే అందుకు నిదర్శనమని చెప్పున్నారు. నిజానికి కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా చుక్క నీరు లిఫ్ట్ చేయలేదని చెప్పడం శుద్ధ అబద్ధం. ఈ ఏడాది వర్షాలు ఆలస్యమైన నేపథ్యంలో మొదటగా ఎల్లంపల్లి నుంచి నీటిని లిఫ్ట్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన నంది, గాయత్రి పంప్‌హౌజ్‌ల నుంచి దాదాపు పది టీఎంసీల నీటిని రాజరాజేశ్వర జలాశయానికి తరలించారు. రిజర్వాయర్ నీటిమట్టం 16 టీఎంసీలకు చేరుకున్న క్రమంలో వరదలు మొదలవడంతో అక్కడ ఎత్తిపోతలను నిలిపేశారు. మిడ్‌మానేరు నుంచి అన్నపూర్ణకు, అక్కడి నుంచి రంగనాయకసాగర్‌కు, ఆపై మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్‌కు నీటిని తరలించారు. మొత్తంగా ఈ ఏడాది ఇప్పటివరకు 23 టీఎంసీలు తరలించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా ఉన్న పంప్‌హౌజ్‌ల నుంచి ఆయా రిజర్వాయర్లకు మొత్తంగా 33 టీఎంసీలను ఎత్తిపోశారు. రంగనాయకసాగర్ రిజర్వాయర్ నుంచి మంత్రి కొండా సురేఖ సాగునీటి కాల్వలకు జలాలను విడుదల చేశారు. ఆయా రిజర్వాయర్ల పరిధిలో చెరువులను కూడా నింపారు. అయినా ప్రాజెక్టును వినియోగించలేదని, నీటిని ఎత్తిపోయలేదంటూ చెప్పడంపై తెలంగాణ ఇంజినీర్లు సైతం ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

ప్రాజెక్టు ఉద్దేశం.. పనితీరు తెలుసా?

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వ్యాఖ్యలపై తెలంగాణ ఇంజినీర్లు సెటైర్లు వేస్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ఉద్దేశం, పనితీరుపై అవగాహన ఉండే ఆ వ్యాఖ్యలు చేస్తున్నారా? అని ప్రశ్నిస్తున్నారు. ఏదో ఒక్కచోట నుంచి మాత్రమే నీటిని తీసుకునేలా రాష్ట్రంలో ఇప్పటివరకు ప్రాజెక్టులను డిజైన్ చేశారు. కానీ, కాళేశ్వరం ప్రాజెక్టు అందుకు పూర్తిగా భిన్నం. ప్రాజెక్టు రాడార్‌లోని రిజర్వాయర్లకు, తద్వారా ఆయకట్టుకు నేరుగా ఎస్కారెస్పీ నుంచి, ఒకవేళ అక్కడ ప్రవాహాలు లేకపోతే దిగువ ఎల్లంపల్లి నుంచి, అక్కడ కూడా ఆశించిన స్థాయిలో వరద లేకపోతే ఆ దిగువన ఉన్న మేడిగడ్డ నుంచి నీటిని తరలించుకునే వెసులుబాటు ఉన్నది. ప్రాజెక్టు విశిష్టత అదే. ఎక్కడ సమృద్ధిగా నీరు లభిస్తే అక్కడి నుంచే తీసుకోవడం దీని ప్రత్యేకత. ఈ ఏడాది ఎస్కారెస్పీకి, ఆ తరువాత ఎల్లంపల్లికి సమృద్ధిగా వరదవచ్చిన నేపథ్యంలో అక్కడి నుంచే నీటిని తీసుకున్నారు. ఒకవేళ ఆ మూడు బరాజ్‌లు వినియోగంలో ఉన్నా కూడా ఎల్లంపల్లి, ఎస్కారెస్పీ నుంచే నీటిని తీసుకునేవారు. ఈ విషయాన్ని దాచిపెట్టి కాంగ్రెస్ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. ఇదిలా ఉంటే కాళేశ్వరం ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశం కూడా వానకాలం సాగుకు సంబంధించినది కాదు. యాసంగి సాగుకు పూర్తి భరోసా కల్పించేందుకు, చెరువులను నింపుకోవడమే కాళేశ్వరం ప్రాజెక్ట్ అసలు లక్ష్యం. వర్షాభావ పరిస్థితుల్లో వానకాలం పంటలకు సాగునీరు అందించడంలోనూ కీలక పాత్ర పోషిస్తుంది. ప్రభుత్వ పెద్దలకు దీనిపై అవగాహన లేదని, కేవలం ప్రాజెక్టును బద్నాం చేయడమే లక్ష్యంగా ప్రచారం చేస్తున్నారని బీఆర్ఎస్ శ్రేణులు వాదిస్తున్నాయి. కాళేశ్వరం ప్రాజెక్టు లిఫ్ట్‌లనే కాదు, రాష్ట్రంలో ఈ ఏడాది వానకాలంలో ఏ ఒక్క ఎత్తిపోతల పథకం నుంచి కూడా నీటిని ఎత్తిపోయకపోవడం గమనార్హం. ఈ ఏడాది కృష్ణా, గోదావరి బేసిన్లలో ఇప్పటికీ ప్రవాహాలు కొనసాగుతుండటమే ఇందుకు కారణం.

గోదావరి బేసిన్‌లో నీటి నిల్వలు (టీఎంసీల్లో)

ప్రాజెక్టు	పూర్తిస్థాయి నిల్వమట్టం	నిరుడు	ప్రస్తుతం
శ్రీరాంసాగర్	80	72.91	80.05
శ్రీరాజరాజేశ్వర	27.50	24.78	26.71
లోయర్ మానేర్‌డ్యాం	24	16.34	23.95
ఎల్లంపల్లి	20	14.05	20.18
సింగూరు	29.17	24.55	29.67
నిజాంసాగర్	17.80	14.59	17.69
కడెం	7.60	6.14	6.42
మొత్తం	216.07	173.36	204.67

(గత సంవత్సరం కన్నా ప్రాజెక్టులో ఇప్పటికీ **31.3** టీఎంసీల జలాలు అదనంగా ఉన్నాయి)

అంచనాలు ఎందుకు పెరిగినయ్?

- ప్యాకేజీలవారీగా వివరాలివ్వండి
- సిబ్బందికి ఇరిగేషన్‌శాఖ ఆదేశం

హైదరాబాద్, నవంబర్ 18 (నమస్తే తెలంగాణ): సీతారామ ఎత్తిపోతల పథకం ప్రాజెక్టు అంచనాలు ఎందుకు పెరిగియో చెప్పాలని, ప్యాకేజీలవారీగా ఆ వివరాలను సమర్పించాలని ఇరిగేషన్ శాఖ ఆ ప్రాజెక్టు అధికారులను ఆదేశించింది. పెరిగిన అంచనాలపై స్టేట్ లెవల్ స్టాండింగ్ కమిటీ (ఎస్ఎల్ఎస్సీ) సమావేశంలో చర్చించి, నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని తెలిపింది. వివరాల్లోకి వెళ్తే.. ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్యశ్యామం చేసేందుకు గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం సీతారామ ఎత్తిపోతల పథకానికి రూపకల్పన చేసింది. ఖమ్మం జిల్లాలోని 25 మండలాలతో పాటు వరంగల్ జిల్లాలోని ఒక మండలంలో మొత్తం 6.74 లక్షల ఎకరాలకు సాగునీరు, వందలాది గ్రామాలకు తాగునీరు అందించేలా ఆ ప్రాజెక్టును డిజైన్ చేసిన కేసీఆర్ ప్రభుత్వం.. 2016లో దాదాపు రూ.7,926 కోట్ల అంచనాతో పరిపాలన అనుమతులను మంజూరు చేసింది. ఆ తర్వాత 2018లో ఆ అంచనాలను రూ.13 వేలకోట్లకు సవరించింది. అనంతరం అదే ఏడాది ఫిబ్రవరి 16న నాటి సీఎం కేసీఆర్ స్వయంగా ఆ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. ప్రధాన కాలువ, 4 పంప్‌హౌజ్‌లు, పాలేరు లింక్ కెనాల్, సత్తుపల్లి ట్రంక్‌తో కూడిన ఆ ప్రాజెక్టును 16 ప్యాకేజీలుగా విభజించారు. వాటిలో 13 ప్యాకేజీలకు అనుమతులు మంజూరు చేయడంతో పనులు కూడా అప్పుడే ప్రారంభమయ్యాయి. డిస్ట్రిబ్యూటరీ పనులకు సైతం గతంలోనే అనుమతులిచ్చారు. ఇదిలావుంటే, తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం ఆ ప్రాజెక్టు అంచనాలను మరో రూ.7 వేల కోట్లు పెంచి దాదాపు రూ.20 వేల కోట్లకు సవరించింది. ఆ మేరకు సీతారామ ప్రాజెక్టు అధికారులు ప్రతిపాదనలను సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపారు. కాగా, ఆర్థిక శాఖ ఆమోదం లేకుండానే ఇటీవల ఆ ప్రాజెక్టు పనులకు అధికారులు టెండర్లు పిలవడం వివాదస్పదంగా మారడంతో మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి సైతం తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో సీతారామ ప్రాజెక్టు పూర్తి వివరాలను ప్యాకేజీల వారీగా సమర్పించాలని తాజాగా ప్రభుత్వం కోరడం చర్చనీయాంశంగా మారింది.

పెండింగ్ బకాయిల విడుదలలో ప్రభుత్వ నిర్లక్ష్యం

ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠ, కార్యదర్శి పుట్ట లక్ష్మణ్

హైదరాబాద్, నవంబర్ 18 (నమస్తేతెలంగాణ) : ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయకపోవడంతో విద్యార్థుల చదువుకు ఆటంకం కలుగుతుందని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి, కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ ఆరోపించారు. దసరా తర్వాత డిగ్రీ కళాశాలలు నాలుగు రోజులు నిరవధిక బంద్ చేస్తే.. వారంలో ఫీజు బకాయిలు విడుదల చేస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పటికీ విడుదల చేయకుండా మాట తప్పిందని విమర్శించారు. మంగళవారం నుంచి మళ్లీ డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు బంద్ నిర్వహిస్తామని.. పరీక్షలు బహిష్కరిస్తామని ప్రకటించడంతో.. విద్యార్థుల భవిష్యత్తుపై ప్రభావం చూపుతుందని చెప్పారు. ప్రభుత్వం వెంటనే స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

వేములవాడ అభివృద్ధికి 127.65 కోట్లు

హైదరాబాద్, నవంబర్ 18(నమస్తేతెలంగాణ): వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర ఆలయ అభివృద్ధికి రూ.127.65 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. ఆలయ కాంప్లెక్స్ విస్తరణతోపాటు ఆధునిక సౌకర్యాల కల్పనకు రూ.76కోట్లు, మూలవాగు వంతెన నుంచి ఆలయం వరకు రోడ్డు విస్తరణ కోసం భూసేకరణకు రూ. 47,85,36,100, బతుకమ్మ తెప్ప నుంచి జగిత్యాల వరకు డ్రైనేజీ నిర్మాణానికి రూ. 3.8 కోట్లు కలుపుకొని మొత్తం 127.65 కోట్లు మంజూరు చేస్తూ వేర్వేరు ఉత్తర్వులు జారీచేసింది. ఆలయ కాంప్లెక్స్ విస్తరణ, మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేటాయించిన రూ. 76కోట్లలో రూ. 50 కోట్లు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం బడ్జెట్ నిధుల నుంచి మంజూరు చేయగా, మిగిలిన రూ.26 కోట్లు వచ్చే 2025-26 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ నిధుల నుంచి మంజూరు చేయనున్నట్టు పేర్కొన్నారు. 4 అక్టోబర్ 2023న జారీచేసిన ఉత్తర్వులకు అనుగుణంగా రోడ్డు విస్తరణ కోసం సేకరించే ఆస్తులకు నష్ట పరిహారం చెల్లింపులకు రూ. 47,85,36,100 మంజూరు చేసినట్టు వెల్లడించారు.

హనుమకొండలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయభాస్కర్, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు తాటికొండ రాజయ్య, చల్లా ధర్మారెడ్డి, గండ్ర వెంకటరమణారెడ్డి, బానోత్ శంకర్‌నాయక్, నన్నపునేని నరేందర్

మహిళలకు 2,500 ఏమైనయి?

- తులం బంగారం ఎక్కడ?: మాజీ మంత్రి ఎర్రబెల్లి
- హెల్త్ సిటీ పనులను కాంగ్రెస్ ఆపింది: ఎమ్మెల్సీ పోచంపల్లి
- రైతులను కాంగ్రెస్ మోసం చేసింది: ఎమ్మెల్యే పల్లా
- మేం కట్టిన వాటికి రేవంత్ ప్రారంభం: దాస్యం వినయ్
- కాంగ్రెస్‌కు కాళోజీ పేరెత్తే అర్హత లేదు : మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

వరంగల్/వనపర్తి, నవంబర్ 18 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/హనుమకొండ/హనుమకొండ చౌరస్తా: మాయ మాటలు, మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలోని మహిళలకు ఏం చేసిందో చెప్పాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు డిమాండ్ చేశారు. మహిళలకు ప్రతి నెలా రూ.2,500 ఇస్తామన్న హామీ ఏమైంది? పేదింటి ఆడబిడ్డ పెండ్లికి కేసీఆర్ ఇస్తున్న రూ.లక్షతోపాటు ఇస్తామన్న తులం బంగారం ఎక్కడని ప్రశ్నించారు. ఎన్నికల ముందు ఇచ్చిన ఏ హామీని నెరవేర్చని రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు దేని కోసం విజయోత్సవ సభ పెడుతున్నారో చెప్పాలని నిలదీశారు. కేసీఆర్ పాలనలో చేపట్టిన పనులకు తుదిదశ మెరుగులు దిద్ది తామే పూర్తి చేసినట్టు చెప్పుకుంటూ ప్రారంభోత్సవాలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్, మాజీ ఎమ్మెల్యేలు టీ రాజయ్య, చల్లా ధర్మారెడ్డి, గండ్ర వెంకటరమణారెడ్డి, బానోత్ శంకర్‌నాయక్, నన్నపునేని నరేందర్‌లతో కలిసి ఎర్రబెల్లి దయాకర్‌రావు సోమవారం హనుమకొండలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ ప్రభుత్వం తడిసిన ప్రతి గింజనూ కొనుగోలు చేస్తే.. ఈ ప్రభుత్వంలో రోడ్లపై, కళ్లాల్లోనే ఉండిపోయాయని విమర్శించారు. వరంగల్‌ను హెల్త్ సిటీగా అభివృద్ధి చేసే సంకల్పంతో కేసీఆర్ రూ.1,500 కోట్లతో అతి పెద్ద సూపర్ స్పెషాలిటీ దవాఖాన నిర్మాణం ప్రారంభించి 80 శాతం పనులు పూర్తి చేశారని, కాంగ్రెస్ ప్రభుత్వం మిగిలిన పనులను పూర్తి చేయడం లేదని ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. వచ్చే మార్చిలోపు నిర్మాణం పూర్తి చేయకపోతే ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు బీఆర్ఎస్ ప్రభుత్వం ఆరు మెడికల్ కాలేజీలు మంజూరు చేసిందని, కాంగ్రెస్ ఏం ఇచ్చిందో చెప్పాలని డిమాండ్ చేశారు. వరంగల్‌లో కాంగ్రెస్ నిర్వహిస్తున్నది విజయోత్సవసభ కాదని, వైఫల్యాల సభ అని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సభకు రైతులను పిలిస్తే రారని మహిళలతో కార్యక్రమం చేస్తున్నారని ఆరోపించారు. రైతు డిక్లరేషన్‌లో చెప్పినట్టు రూ.2 లక్షల రుణమాఫీ, వరికి రూ.500 బోనస్, పంటల బీమా, రైతు భరోసా ఏ ఒక్కటి అమలు చేయనుందకు కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజాకవి కాళోజీ మెమోరియల్ బిల్డింగ్ కోసం ఉమ్మడి రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం 300 గజాల జాగా ఇవ్వలేదని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ దుయ్యబట్టారు. ఉమ్మడి రాష్ట్రంలోని పాలకులు కాళోజీ కళాక్షేత్రాన్ని పట్టించుకోలేదని, ఇప్పుడు తామే చేసినట్టు కాంగ్రెస్ చెప్పుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. ఉమ్మడి రాష్ట్రంలో కాళోజీ కళాక్షేత్రం నిర్మాణానికి 300 గజాల స్థలం కావాలని కాళోజీ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు, కాళోజీ మిత్ర బృందం అడిగితే అప్పుడి కాంగ్రెస్ ప్రభుత్వం తిరస్కరించిందని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ ఒక ప్రకటనలో విమర్శించారు. 300 గజాల స్థలం ఇవ్వని కాంగ్రెస్.. ఇప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి కాళోజీ కళాక్షేత్రాన్ని చూసి ఏమని సమాధానం చెప్తారని వినోద్ ఆ ప్రకటనలో ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి ఏ ముఖం పెట్టుకొని వరంగల్ జిల్లా పర్యటనకు వస్తున్నావని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకట్ నాయక్ ప్రశ్నించారు. మంగళవారం హనుమకొండలో నిర్వహిస్తున్న విజయోత్సవ సభను లంబాడా గిరిజనులు బహిష్కరించాలని ఆయన పిలుపునిచ్చారు. రైతు డిక్లరేషన్‌ను నెరవేర్చకుండా వరంగల్‌కు ఏ ముఖం పెట్టుకొని వెళ్తున్నావని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి సీఎం రేవంత్‌ను ప్రశ్నించారు. పథకాలన్నింటినీ పెండింగ్‌లో పెట్టి నేడు కాళోజీ కళాక్షేత్రం ప్రారంభోత్సవానికి సీఎం రేవంత్ వెళ్తున్నారని, కాళోజీ పేరెత్తే అర్హత ప్రభుత్వానికి లేదని స్పష్టంచేశారు.

కరీంనగర్ జిల్లా జమ్మికుంట పోలీసుల అదుపులో దళిత బంధు లబ్ధిదారులు

హుజూరాబాద్‌లో దళితుల ముందస్తు అరెస్టు

- బాధితులంతా దళితబంధు రెండో విడత లబ్ధిదారులే
- దళితుల ముందస్తు అరెస్ట్ అన్యాయం: పాడి కౌశిక్‌రెడ్డి

వీడియో సందేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

కరీంనగర్, నవంబర్ 18 (నమస్తే తెలంగాణ)/హుజూరాబాద్ టౌన్: కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ నియోజకవర్గంలో దళితులపై నిర్బంధకాండ కొనసాగుతున్నది. రెండో విడత దళితబంధు కోసం 11 నెలలుగా ఆందోళనలు నిర్వహిస్తున్న కొందరు లబ్ధిదారులను ఇప్పటికే 19 సార్లు అరెస్టు చేశారు. మంత్రులు, ప్రభుత్వ ముఖ్యులు, అధికార పార్టీ ప్రముఖులు ఎవరు పర్యటనకు వచ్చినా హుజూరాబాద్ దళితులను ముందస్తుగా అరెస్టు చేసి నిర్బంధిస్తున్నారు. మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి వరంగల్ పర్యటనకు వస్తున్న నేపథ్యంలో సోమవారం తెల్లవారుజాము నుంచే దళితబంధు సాధన సమితి నాయకులు, లబ్ధిదారులను అరెస్టు చేశారు. హుజూరాబాద్‌లో ముగ్గురు, జమ్మికుంటలో ఏడుగురు, ఇల్లందకుంటలో నలుగురు, వీణవంకలో ఒకరిని అదుపులోకి తీసుకుని ఆయా పోలీసుస్టేషన్లకు తరలించారు. వీరిలో కొందరికి గ్రూప్-3 పరీక్షలు ఉన్నాయని వేడుకున్నా పోలీసులు వదలలేదని వాపోయారు. మంగళవారం వరంగల్, బుధవారం సిరిసిల్లలో సీఎం రేవంత్‌రెడ్డి సభలు ఉండటంతో.. పోలీసులు అదుపులోకి తీసుకున్న దళితులను ఈ సభలు ముగిసే వరకు విడిచిపెట్టే అవకాశం కనిపించడం లేదు. జమ్మికుంట పట్టణంలోని కొలుగూరి సురేశ్ దళితబంధు లబ్ధిదారుడు. అనారోగ్యంతో ఉన్న తన కూతురిని స్థానిక ప్రైవేట్ దవాఖానకు తీసుకెళ్లగా.. సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడికి వెళ్లారు. 'సార్ పిలుస్తున్నారు' అని రమ్మని చెప్పగా తన కూతురు జ్వరంతో బాధపడుతున్నదని, డాక్టర్‌కు చూపించిన తర్వాత వస్తానని చెప్పినా పోలీసులు అక్కడే ఉండి నిఘా పెట్టారని సురేశ్ వాపోయాడు. కాగా.. హుజూరాబాద్ నియోజకవర్గ వ్యాప్తంగా దళితబంధు రెండో విడత లబ్ధిదారులను అరెస్టు చేయడం అప్రజాస్వామికం అని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి మండిపడ్డారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక వీడియో సందేశం విడుదల చేశారు. అరెస్టు చేసిన దళితబంధు సాధన సమితి నాయకులు, లబ్ధిదారులను వెంటనే విడిచిపెట్టాలని, లేకుంటే ప్రజలందరితో కలిసి పెద్దఎత్తున ఆందోళనలకు దిగుతామని హెచ్చరించారు.

తెలంగాణలో పోలీసు రాజ్యం

బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులపై కక్షసాధింపు: మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

గోదావరిఖనిలో మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

గోదావరిఖని, నవంబర్ 18: తెలంగాణలో పోలీస్ రాజ్యం నడుస్తున్నదని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ధ్వజమెత్తారు. సోమవారం ఆయన పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని టీబీజీకేఎస్ కార్యాలయంలో రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. న్యాయాన్